నందగిరినగర్‌లో.. దాహం దాహం

* 43, 44 వార్డుల్లోని నందగిరినగర్, శ్రీనివాసనగర్‌లలో నీటి ఎద్దడితో అవస్థలు
* భూగర్భ జలాలు అడుగంటడంతో పని చేయని బోర్లు
* కుళాయి నీరే ఆధారంగా నెట్టుకొస్తున్న జనం
* మార్చి నుంచి నీటి సమస్యతో అవస్థ పడుతున్నా పట్టని యంత్రాంగం
* సుమారు మూడు వేల కుటుంబాలు అవస్థలు పడుతున్నా కానరాని జీవీఎంసీ వాటర్ ట్యాంకర్లు
* కుళాయి ధార పెంచి, 45 నిమిషాల పాటు నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్న మహిళలు


నీటి ఎద్దడి ఉన్న నందగిరినగర్ ప్రాంతం

సీతంపేట: అసలే ఎండాకాలం.. ప్రతి ఇంట్లో నీటి వాడకం పెరిగింది. అవసరాలకు తగినట్టు నీరు దొరక్క జనం అవస్థల పాలవుతున్నారు. జీవీఎంసీ 43,44 వార్డుల పరిధి పలు ప్రాంతాల్లో రెండున్నర నెలలుగా నీటి ఎద్దడి నెలకొంది. శ్రీనివాస నగర్, నందగిరినగర్, కర్రివానిబ్రిడ్జి, గోలీలపాలెం, దాడిరామ్మూర్తి కల్యాణ మండపం, సంగం ఆఫీస్ ప్రాంతాల్లో మంచినీరు దొరక్క సుమారు మూడు వేల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో ఇళ్లలోని బోర్ల నుంచి చుక్క నీరు కూడా రాని పరిస్థితి. పోనీ వీధి బోర్లను ఆశ్రయిద్దామంటే అక్కడ కూడా అదే పరిస్థితి. రెండున్నర నెలలుగా బోర్లు మూగనోము పట్టాయి. చుక్క నీరు కూడా విదల్చడం లేదు. వేసవిలో పెరిగిన నీటి అవసరాలతో కుళాయి నీరే దిక్కయింది. ఒకొక్క ఇంట్లో రెండేసి, మూడేసి కుటుంబాలు నివసిస్తున్నాయి. అందరికీ కుళాయి నీరే ఆధారం కావడంతో నీరు సరిపోక ఇబ్బందులకు గురవుతున్నారు. రెండున్నర నెలలుగా ఇళ్లు, వీధుల్లో బోర్లు పని చేయక నీటి కోసం బిందెలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని నందగిరినగర్‌కు చెందిన ఎస్. జయ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండగ నుంచి ఇంట్లో బోరు నుంచి నీరు రావడంలేదని, ఇంట్లో ఉంటున్న రెండు కుటుంబాలకు ఒక్క కుళాయి నీరే ఆధారమయిందని, వీధిలో బోర్లు కూడా పని చేయడం లేదని వాపోయింది. కనీసం ట్యాంకర్లతో నీటిని సప్లై చేసి ఉంటే ఈ ఇబ్బందులు తప్పేవని అంటున్నారు స్థానిక మహిళలు.


శ్రీనివాసనగర్‌లో దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద పని చేయని వీధి బోరు బావి

చిన్న ధారతో అవస్థలు..

జీవీఎంసీ కుళాయిలు రోజూ 45 నిమిషాలు ఇవ్వాల్సి ఉండగా , 20 నుంచి 30 నిమిషాలు మాత్రమే కుళాయి ఇస్తున్నారని మహిళలు చెబుతున్నారు. అది కూడా చిన్న ధార ఇవ్వడంతో నీరు సరిపోక ఇబ్బంది పడుతున్నారు. 45 నిమిషాల పాటు ధార ఫోర్సుగా ఇస్తే నీటి ఇబ్బంది ఉండదని, సిబ్బందిని ధార పెంచాలని అడిగితే రెండు రోజులు ఇస్తున్నారు.. ఆ తర్వాత ఎప్పటిలా సన్నధార ఇస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. ఇళ్లల్లో బోర్లు పని చెయ్యక నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతుంటే మరో పది నిమిషాలు అదనంగా కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలన్న ఆలోచన అధికారులకు లేకపోవడం బాధాకరమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నందగిరినగర్‌లో ఇంటిలో అడుగంటిన మోటారు బోరు


నందగిరినగర్‌లో పని చేయని బోరు

కుళాయి నీరే దిక్కు..



నందగిరినగర్‌లో రెండున్నర నెలలుగా ఇళ్లల్లో బోర్లు పని చేయడం లేదు. వీధిలో బోర్లు కూడా చుక్క నీరివ్వడం లేదు. ఇంటి యజమానులు, అద్దెకు ఉండే కుటుంబాలు అందరూ ఒకే ఒక్క కుళాయి కనెక్షన్‌పై ఆధారపడ్డాం. కుళాయి అరగంట సేపే సన్నధార ఇస్తున్నారు. నీరు సరిపోక ఇబ్బంది పడుతున్నాం. మార్చి నుంచి నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం, ఏ అధికారి పట్టించుకోలేదు.

– వై.కామేశ్వరి, గృహిణి, నందగిరినగర్

ట్యాంకులతో నీరు కొంటున్నాం..



జగ్గారావు బ్రిడ్జి నుంచి కర్రివాని బ్రిడ్జి, శ్రీనివాసనగర్, నందగిరి నగర్, అటు వెంకటేశ్వరకాలనీ వరకు మధ్య ఉన్న ప్రాంతంలో భూమిలో నీరు అడుగంటింది. బోర్లు పని చేయడం లేదు. కేవలం జీవీఎంసీ ఇచ్చే కుళాయి నీటిపైనే ఆధారపడ్డాం. నీరు సరిపోక ట్యాంకులతో నీరు కొంటున్నాం. గతంలో జీవీఎంసీ ట్యాంకర్లతో నీటిని సప్లై చేసేది. ఈ ఏడాది నందగిరినగర్‌కు ఇప్పటి వరకూ ఒక్క ట్యాంకర్ కూడా రాలేదు.

– ఎస్.జయ, గృహిణి, నందగిరినగర్

24/7 నీటి సరఫరా ఎప్పుడు?



నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ప్రతి ఏటా వేసవిలో నీటి ఎద్దడి సమస్య వెంటాడుతోంది. ఈ ప్రాంతాలకు అమృత్ పథకం కింద 24/7 నీటి సరఫరా చేస్తామని గత ఐదేళ్లుగా పనులు చేపడుతున్నారు. ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. వోవర్ హెడ్‌ట్యాంకు కట్టారు, రెండేళ్ల నుంచి పైపులు వేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి 24/7 నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎ.శర్వాణి, గృహిణి, నందగిరినగర్.

క్లుప్తంగా

విద్యార్థులకు పెయింటింగులో శిక్షణ


తాము గీసిన ఇంద్ర ధనుస్సు చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పెయింటింగులో శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.ఎస్.ఎన్.మూర్తి, రచయిత కొప్పుల కాశీ విశ్వేశ్వరరావు, రమణయ్య మాస్టర్ పాల్గొని పుస్తక పఠనం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఇంద్ర ధనస్సులోని ఏడు రంగులతో విద్యార్థులు పెయింటింగు వేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి వై.పద్మజ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చేపడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, పలు నిర్వహణ పనుల నిమిత్తం 28వ తేదీ బుధవారం దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ బి. సింహాచలం నాయుడు ప్రకటనలో తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్, విద్యుత్ నగర్, పోర్టు ఈస్ట్ గేట్ ఏరియా, బాలయ్య శాస్త్రి లే అవుట్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి, జీఆర్‌పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పుగాజ్హేందీ తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేల విలువైన 7 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యోగ సిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయస్వామి

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్–2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం ఆలయ అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సింధూర అర్చన, తమలపాకుల పూజ నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక సుందర కాండ పారాయణం చేశారు. యోగ సిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ కలాసీలకు టైం స్కేల్ అమలుకు హామీ

జగదాంబ: విశాఖ పోర్ట్ పూల్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని పోర్ట్ చైర్మన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీల జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోర్టు పూల్ కలాసీలతో కలిసి చైర్మన్‌తో మాట్లాడి వినతి పత్రం అందజేశారు. కలాసీలు పోర్ట్‌ను నమ్ముకుని చాలా కాలంగా జీవిస్తున్నారని తెలిపారు. వారందరికీ టైం స్కేల్, మెడికల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యకుడు హేమంత్‌కుమార్, జుంజురు గోవింద్, యూనియన్ నాయకులు రాము, రమేష్, భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైకాలజిస్ట్ కృష్ణారావుకు గోల్డెన్ పీకాక్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సైకాలజిస్ట్ డాక్టర్ సీతారామ కృష్ణారావు

సీతంపేట: నగరానికి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.సీతారామ కృష్ణారావు విద్యా, మనో వైజ్ఞానిక శాస్త్ర, వ్యక్తిత్వ వికాస రంగాలలో చేసిన కృషికి గ్లోబల్ బెస్ట్ ప్రొఫెసర్ గోల్డెన్ పీకాక్ 2025 అవార్డు అందుకున్నారు. ముంబైకి చెందిన అంతర్జాతీయ సంస్థ మోటివేషనల్ విజనరీ లీడింగ్ అవార్డ్స్ ట్రస్ట్ (ఎంవీఎల్ఏ) ఈనెల 25న హైదరాబాదులో ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు కోఆర్డినేటర్ ఎస్.అమోల్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన విద్యా, సైకాలజీ రంగాలలో చేస్తున్న కృషిని గుర్తించి అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. మన దేశంలో 12 మంది, మరో 16 దేశాల నుంచి మరో 26 మందికి అవార్డులు ప్రదానం చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది తనకు నాలుగు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని, చాలా ఆనందంగా ఉందన్నారు. కామెడీ క్లబ్ సంస్థల ప్రతినిధులు కోరుకొండ రంగారావు, వేముల భాస్కరాచారి, ఎస్.సత్యవరప్రసాద్ అవార్డు గ్రహీతను అభినందించారు.

పరదేశమ్మకు కె.కె. రాజు పూజలు


పరదేశమ్మకు పూజలు చేస్తున్న కె.కె. రాజు తదితరులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీలో గల పరదేశమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు పాల్గొన్నారు. పండగలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దాడి శ్రీనివాసరావు, నూనెల పోలారావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, జె. శ్రీనివాసరెడ్డి, గాలి ప్రసాద్, భీశెట్టి ప్రసాద్, చందన్ సాయి, రిషికేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ


వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరుకులు, పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందించారు. ప్రభావతి మనుమడు అభిరామ్ కార్తికేయ పుట్టిన రోజు సందర్భంగా ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పి.సూర్యనారాయణ, వృద్ధాశ్రమం నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ, సంయుక్త కార్యదర్శి జి.శిరీష లత, బులెటెన్ ఎడిటర్ సీహెచ్ పద్మావతి, కార్యవర్గ సభ్యులు ఆర్. స్నేహలత, జి.మంగాదేవి, కె.బిందురాణి, కె.వినీల, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చదరంగంలో ఉచిత శిక్షణ

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో బాలబాలికలకు చదరంగం ఇండోర్ క్రీడపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 తేదీ నుంచి జూన్ 7 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు చదరంగం కోచ్ సనపల ఉమాపతి శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 7659804633, 9491292369 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముమ్మరంగా యోగా సాధన


యోగా సాధన చేస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నారాయణరావు, సిబ్బంది

మురళీనగర్: విశాఖపట్నంలో జూన్‌లో నిర్వహించనున్న జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వివిధ సంస్థల ప్రతినిధులు సాధన చేస్తున్నారు. వివిధ పాఠశాలలు, కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రత్యేక శిక్షకుల ఆధ్వర్యంలో సిబ్బంది యోగా సాధన చేస్తున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో వివిధ విభాగాల హెడ్‌లు, కాలేజీ అధ్యాపకులు, కార్యాలయం సిబ్బంది మంగళవారం యోగా సాధన చేశారు. విద్యార్థులు యోగా దినోత్సవంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ పట్టివేత

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై జీవీఎంసీ ప్రతేక బృందాలు దాడులు చేసి 40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు చేశారు. ఈ మేరకు ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మురళి, గంగాధర్, రంగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ఉచిత ప్రవేశం


విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ స్నో వరల్డ్‌లో దివ్యాంగ బాలలు సందడి

సీతంపేట: విశాఖ గిరిజన ప్రాంతం అడ్డతీగలలో ఒక దివ్యాంగ సంస్థకు చెందిన 150 మంది మానసిక అంగవైకల్యం కలిగిన చిన్నారులు అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో గల విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌ను సందర్శించారు. వీరికి క్లబ్ యాజమాన్యం ఉచిత ప్రవేశం కల్పించి స్నో వరల్డ్, ఫన్ జోన్, వాటర్ వరల్డ్‌లో ఆనందంగా గడిపేలా అవకాశం కల్పించారు. అలాగే వారికి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విశాఖ జిల్లాకు చెందిన అనాథ బాలలు, మానసిక, అంగవైకల్యం కలిగిన దివ్యాంగ బాలలకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఆయా సంస్థలు తమను సంప్రదిస్తే బుధవారం రోజు ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ, అనాథ బాలలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం పంతులు సేవలు అజరామరం

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం 106వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ తుంపాల శ్రీరామ్మూర్తి తదితరులు వీరేశలింగం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కరణ కార్యక్రమాల్లో వీరేశలింగం పంతులు నిర్వహించిన కృషిని చిన్నారులకు వివరించారు. బాల్య వివాహాలను రూపుమాపారని, వితంతు వివాహాలను జరిపించారని, బాలికలు చదువుకోవడాన్ని ప్రోత్సహించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దళితుల బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మూడు లక్షల మంది ఎస్సీ జనాభా ఉంటే, ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు కేవలం నాలుగు వందల యూనిట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రులు ఉన్న నియోజకవర్గాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, పిఠాపురం, పాయకరావుపేట, తెనాలి నియోజకవర్గాల్లో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళితుల రక్షణకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజులు, గుడాల రాంబాబు, పిల్లి వీర్రాజు, ఎస్ఏడీ రాజ్, శ్రీనివాస్, పిల్లి రాము, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు


అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ హైస్కూల్‌కి వెళ్లే రోడ్‌లో శ్రీవిశ్వ కళాశాల వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కశిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు.ఈ మేరకు పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదన్నారు. వందలాది పేద కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్–6 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. వనజాక్షి, ఆనంద్, అచ్యుత్ రావు, సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహేంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్‌లో 18 నుంచి 30 ఏళ్ల లోపు గల డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. హెల్త్‌కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో, షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పటల్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.